వైభవంగా నిత్య తిరుకల్యాణోత్సవం

ఊంజల్ సేవలో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 26 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయ ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. లక్ష్మీసమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణ మూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ జరిపారు. సాయంత్రం ప్రధానాయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యపూజలు స్మార్త గమశాస్త్రరీతిలో జరిగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.9,43,076 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

రుణమాఫీ వివరాల సేకరణ

గ్రామీణ వికాస్ బ్యాంకులో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ వెంకటేశ్వర్లు

ఆత్మకూరు(ఎం), జూలై 26 : మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్‌తో ఏడీఏ వెంకటేశ్వర్లు శుక్రవారం సమావేశమై రైతు రుణ మాఫీ వివరాలను సేకరించారు. రుణ మాఫీ డబ్బులను రైతులకు వెంటనే అందివ్వాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ మనీషా ఉన్నారు.

యువ చేనేత కార్మికుడు ముఖేశ్‌కు సన్మానం

చేనేత కార్మికుడు ముఖేశ్‌ను సన్మానిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్

చౌటుప్పల్, జూలై 26 : కేంద్ర చేనేత, జౌళిశాఖ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన కొయ్యలగూడెం యువ చేనేత కార్మికుడు కర్నాటి ముఖేశ్‌ను మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. ఉన్నత చదువులు చదివి వృత్తిలో రాణిస్తున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో వృత్తిలో మరింత ఎదుగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మసనం శ్రీనివాస్, ప్రతినిధులు కోడి కృష్ణ, తిరుమల్లేశ్, రఘు, వై.సతీశ్, సిద్ధయ్య, వెంకటేశ్, అశోక్, కుమార్, స్వామి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

నిరసన తెలుపుతున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

చౌటుప్పల్, జూలై 26 : తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీలోని లక్కారం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు లేక కొన్నేండ్ల నుంచి కుటుంబాలకు దూరంగా ఉండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే బదిలీలు చేపట్టి ఉద్యోగోన్నతలు కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీపాజోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చే వరకు భూ పోరాటం ఆగదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

అశోక్‌కు పూలమాల వేసి దీక్షను ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి కలెక్టరేట్, జూలై 26 : మండలంలోని హనుమాపురం సర్వే నెంబర్ 28లో 76 ఎకరాలు, బొమ్మాయిపల్లి సర్వే నెంబర్ 118లో లేఅవుట్ చేసి స్థలాలు ఇవ్వాలని, బస్వాపురంలో పట్టాలు పొందిన వారికి ఇండ్ల జాగా ఇచ్చేవరకు పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఒకరోజు ఉపవాస దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పేదలకు స్థలాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. దీక్షా శిబిరాన్ని తాసీల్దార్ అంజిరెడ్డి సందర్శించి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, చెక్క వెంకటేశ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, పార్టీ పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు అభిలాశ్, మహేశ్, నాయకులు మల్లేశం, రాఘవులు, పెంటయ్య, భిక్షపతి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ విడుదల చేయాలి : ఏఐటీయూసీ

భువనగిరి కలెక్టరేట్, జూలై 26 : భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేసి మీ సేవలో ఉన్న వేలిముద్ర విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ తాహెర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు కార్డు నమోదు చేసుకోవాలన్నా, క్లెయిమ్ కోసం అప్లై చేయాలన్నా మీ సేవలో తంబ్ విధానం పెట్టడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, 60 ఏండ్లు నిండిన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యాలయాల్లో ఏసీఎల్, డీసీఎల్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రసూతి కానుక రూ.50వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, నాయకులు శోభనబాబు, సీతారాం, గౌస్, రాంచందర్, రవీందర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఐదుగురు అనుమానితులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 26 : గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మండలంలోని వీరవెల్లితోపాటు సమీప గ్రామాల్లో వ్యవసాయ మోటర్లు, స్టాటర్లు, కరెంటు వైర్లు, మూగ జీవాలు, పైపులు కొంతకాలంగా చోరీకి గురవుతున్నాయి. ఈ క్రమంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వీరవెల్లికి చెందిన ఐదుగురు అనుమానితులను రూరల్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై రూరల్ పోలీసులను సంప్రదించగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య తెలంగాణ కోసం అందరూ పనిచేయాలి

- స్టేట్ ఫుడ్స్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆయా శాఖల అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న స్టేట్ ఫుడ్స్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై 26 : పిల్లల బంగారు భవిష్యత్ కోసం, ఆరోగ్య తెలంగాణ కోసం అందరూ పనిచేయాలని తెలంగాణ స్టేట్ ఫుడ్స్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమావేశమై ఆహార భద్రత హక్కు చట్టం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నోడల్ అధికారులు తరచూ పాఠశాలలు, హాస్టళ్లు, దవాఖానల్లో తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందేలా చూడాలని అన్నారు. రేషన్ షాపుల్లో తప్పనిసరిగా ఫిర్యాదుల బాక్సు, అధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించేలా చూడాలని, బియ్యం, సరుకులు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం గుడ్ల ధర పెంపుపై ప్రతిపాదనలు పంపాలని, వాటిని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని అన్నారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు, నోడల్ ఆఫీసర్లు తరచూ సంక్షేమ హాస్టళ్లను, అంగన్‌వాడీలను సందర్శిస్తున్నారని తెలిపారు. వైద్యారోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులను నమోదు చేసుకోవడం, వారికి ఆహార ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించడం చేస్తున్నారన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాలు, మున్సిపాలిటీల్లో డ్రై డే కార్యక్రమాల ద్వారా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

స్టేట్ ఫుడ్స్ కమిషన్ సభ్యులు ఆర్.శారద, వి.ఆనంద్ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో గ్రీన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, మునగ ఆకును పిల్లలకు ఉపయోగించేలా చూడాలని అన్నారు. అంగన్‌వాడీల్లో మెనూ పాటించాలని, మూడేండ్లలోపు చిన్నారులకు బాలామృతం తప్పనిసరిగా అందించాలని సూచించారు. సరైన ఆహారం అందించకపోతే చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెలా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి 3, 4 వసతి గృహాలను, పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పిల్లలకు సమస్యలు వస్తే ఫిర్యాదులు చేసేలా ప్రతి హాస్టల్ అధికారి పేరు, ఫోన్ నెంబర్లతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, అదనపు డీఆర్డీఓ సురేశ్, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం

యాదగిరిగుట్ట, జూలై 26 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్టకు మంజూరు చేసిన జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నేటి నుంచి మనుగడలోకి రానుంది. పట్టణంలోని తులసీ కాటేజీ ప్రాంతంలోని దేవస్థాన భవనంలో కోర్టును తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పనులన్నీ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్న కోర్టును శనివారం ఉదయం ప్రారంభం కానున్నదని యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడ్ల స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ వి.వేణుగోపాల్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, కె.సుజన, జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ న్యాయమూర్తి ఎ.జయరాజు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం స్వామివారి దర్శనం అనంతరం 11 గంటల సమయంలో హైకోర్టు న్యాయమూర్తులు కోర్టును ప్రారంభిస్తారని వెల్లడించారు.

పోచంపల్లి మండలంలో ఇద్దరికి డెంగీ

భూదాన్ పోచంపల్లి, జూలై 26 : పట్టణంలోని సాయినగర్‌లో ఒకరికి, మండలంలోని భీమనపల్లి గ్రామంలో మరొకరికి డెంగీ లక్షణాలు కనిపించాయి. సాధారణంగా జ్వరం, తలనొప్పి, విపరీతమైన ఒళ్లు నొప్పులు, అలసట, ప్లేట్‌లెట్లు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు తెలిపారు. సాయినగర్‌లో విజయ్‌లోకేశ్‌కు డెంగీ నిర్ధారణ అయ్యిందని, మందులు వాడడంతో కోలుకుంటున్నాడని డాక్టర్ సందీప్ తెలిపారు. భీమనపల్లి గ్రామానికి చెందిన అవినాశ్‌రెడ్డికి డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయని, పరీక్షల అనంతరం నిర్ధారన అవుతుందని పేర్కొన్నారు. దోమలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సూచించారు.

వ్యక్తి అదృశ్యం

రామన్నపేట, జూలై 26 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన కట్ట మహేందర్ మార్చి 20న రామన్నపేటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదు. తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712662487 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అయితే.. గతంలో ఇలాగే పోయి రెండు, మూడు నెలల తరువాత ఇంటికి వచ్చేవాడు. అతని మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు పలు దవాఖానల్లో చికిత్స చేయించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

మోడల్ స్కూల్ వసతి గృహంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

గుండాల, జూలై 26 : పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, భోజనం, పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ప్రభుత్వం మంజూరు చేసిన పనులు ప్రారంభం కాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో 90శాతం పనులు పూర్తయినట్లు నివేదికలు సమర్పించి, సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్లకు 50శాతం కూడా చెల్లించకపోవడంపై ఎంపీడీఓ దేవిక, పీఆర్ ఏఈ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో తక్షణమే పనులు ప్రారంభించాలని, మండల వ్యాప్తంగా పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేశ్ కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి, వైద్యాధికారి యూనస్, ఇన్‌చార్జి ఎంపీఓ ధనుంజయ్ ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సయ్య

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సయ్య

మోత్కూరు, జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం చేసిందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనర్సయ్య అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత భరోసా పేరుతో ప్రభుత్వం కాలం గడుపుతున్నదని, నేతన్నల కోసం ఏ ఒక్క పథకానికీ నిధులు కేటాయించలేదని అన్నారు. బడ్జెట్‌లో చేనేత, పవర్‌లూమ్‌లకు కలిపి రూ.370 కోట్లు కేటాయించారని, ఇది ఎందుకూ సరిపోదని పేర్కొన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి రాములు, సహాయ కార్యదర్శి పోచం కన్నయ్య, మండలాధ్యక్షుడు వంగరి రాములు, నాయకులు సోమయ్య, లక్ష్మయ్య, నర్సయ్య, నారాయణ, రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

ఆలేరు రూరల్, జూలై 26 : తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని శర్భనాపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మాజీ ఎంపీపీ సుదగాని ఎట్టన్న వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా వివక్ష చూపడం సరికాదన్నారు. ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందించే గంధమల్ల రిజర్వాయర్ గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఆలేరు నియోజకవర్గానికి సాగు నీరు అందించే గంధమల్ల ప్రాజెక్టు గురించి ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు సత్యరాజయ్య, నవీన్ పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి'

మోత్కూరు, జూలై 26 : పేదలకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం వ్యవసాయ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచలేదని తెలిపారు. రైతులపై భారం పెంచి విదేశీ పెట్టుబడిదారులకు పన్నులు తగ్గించి వారికి లాభం చేకూర్చేలా బడ్జెట్‌ను రూపొందించారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాములమ్మ, అంజయ్య, నర్సింహ, అంజమ్మ, లక్ష్మి, అలివేలు, మమత, సావిత్రి, శ్రావణి పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం : ఎస్ఎఫ్ఐ

భువనగిరి అర్బన్, జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ, పట్టణ అధ్యక్షుడు ఈర్ల రాహుల్ అన్నారు. భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తాలో శుక్రవారం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.21,389 కోట్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21,292 కోట్లు కేటాయించిందని తెలిపారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఈర్ల కార్తీక్, ఎండీ నేహాల్, భవానీశంకర్, సతీశ్, మహేశ్, గౌతిక్ పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 7.3 శాతం మాత్రమే నిధులు కేటాయించి విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఉదయ్‌కుమార్, నరేందర్, ఏసోబు, మణికంఠరెడ్డి, బిందు, అశ్విత, మనోజ్, దుర్గప్రసాద్, సాయి, శివ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బడ్జెట్ కేటాయింపులో వివక్ష

రామన్నపేట : దివ్యాంగులకు బడ్జెట్ కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపాయని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని సుభాశ్ సెంటర్‌లో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌ను సవరించి 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం మండలాధ్యక్షుడు బల్గూరి అంజయ్య, కార్యదర్శి గరికల లింగస్వామి, నాయకులు నర్సింహ, శ్రీధర్, యాదగిరి, చంద్రమౌళి పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రామన్నపేట : బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ఎన్‌పీఆర్‌డీ నాయకులు

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, జూలై 26 : అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని మండల కేంద్రంలో మాతృదేవోభవ, పితృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కురుమేటి నవీన్ అధ్యక్షతన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు అలవాట్లను మానుకొని ఆరోగ్యంగా ఉండి ఆపదలో ఉన్న వారికి రక్తం అందించి ప్రాణదాతలు కావాలన్నారు. కార్గిల్ విజయ్ దివస్ స్ఫూర్తితో అమర జవాన్ల ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ బి వీరన్న, సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, మాజీ జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, మాజీ సర్పంచులు గోదాసు శిరీషాపృథ్వీరాజ్, గంగుల రాజిరెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎండీ రేహాన్, సంస్థ సభ్యులు నోముల యాదగిరి, వేముల సైదులు, మేడి రాజు, నోముల ప్రవీణ్, విష్ణు, శివ, సైదులు, నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ పూజలు

స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

భువనగిరి కలెక్టరేట్, జూలై 26 : పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిత్యపూజలు వైభవంగా జరిగాయి. ఉదయం 6గంటలకు స్వామివారికి సువర్ణ బిందె తీర్థం నిర్వహించారు. 7గంటలకు వేయి నామాలను పటిస్తూ సహస్రనామార్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆసనంపై శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి దివ్య మంగళమూర్తులను దేదీప్యమానంగా అలంకరించి కల్యాణ మహోత్సవం జరిపించారు. 3వేల మందికి పైగా భక్తులకు నిత్యాన్నదానం చేశారు.

త్వరలో దూదివెంకటాపురానికి కేంద్ర బృందం

- జడ్పీ సీఈఓ శోభారాణి

ప్రజాపాలన ద